## మిరపపంట సస్యరక్షణ చర్యలు పాటించాలి

వీపనగండ్ల, అక్టోబర్ 19 : ప్రస్తుతం మిరప పంట శాఖీయ దశ నుంచి దశలో ఉందని, మిరపలో జెమిని వైరస్ (ఆకు ముడల తెగులు) గమనించామని ఉద్యానశాఖ మండల అధికారి (హెచ్‌వో) కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరపలో జెమిని వైరస్ నివారణలో భాగంగా వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. పొలంలో కలుపు మొక్కలను నివారించాలి. పసుపురంగు జిగురు అట్టలను ఎకరాకు 8నుంచి10 వరకు అమర్చాలి. 1.5 మిల్లీ పైరిప్రాక్సిపెన్ లేదా పైరిప్రాక్సిపెన్తో పాటు 1మిల్లీ ఫెన్ ప్రోపాథిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి లేదా 5 మిలీయజాడిరక్టన్(1500 పీపీఎం)తో పాటు 0.3 గ్రాముల ఎసిటమిప్రిడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

## మెరిట్ స్కాలర్‌షిప్‌కు కళాశాల విద్యార్థి ఎంపిక

వీపనగండ్ల, అక్టోబర్ 19 : 2022-23 విద్యా సంవత్సరంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీపీ పూర్తి చేసిన మండ్ల కార్తిక్ నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇతడికి డిగ్రీలో ప్రతియేడాది రూ.10 వేల చొప్పున మూడు ఏండ్లకు రూ.30 వేలు, పీజీలో ప్రతి యేడాది రూ.20వేల చొప్పున రెండేండ్లకు, రూ.40 వేలు కలిపి మొత్తం రూ.70 వేలు స్కాలర్‌షిప్ అందుతుందని ఆయన తెలిపారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## వరి పైరుకు సుడిదోమ ప్రభావం

కొల్లాపూర్,అక్టోబర్ 19 : మండల పరిధిలోని ఎల్లూరు శివారులో వానకాలంలో సాగు చేసిన వరి పైరును వ్యవసాయ విస్తరణ అధికారిణి మౌనికారెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట ఈనిక,పాలు పోసుకొనే దశలో ఉంది. అక్కడక్కడ సుడిదోమ తెగుళ్ల ప్రభావం ఉన్నట్లు ఆమె గమనించారు. బూడిద రంగు దోమ,తెల్లవీపు దోమ,నీటిపై భాగంలో దుబ్బల దగ్గర ఉండి రసం పీల్చడం తో పైరు లేత పసుపు రంగులోకి మారుతుందని వ్యవసాయ అధికారిణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. సుడులు,సుడులుగా వలయాకారంలో ఎండిపోతూ ఉంటుంది.పురుగు ఉధృతి ఎక్కువ అయితే పొలం ఎండిపోయి తాలు గింజలు ఏర్పడడం జరుగుతుందని ఆమె వివరించారు.ఉధృతి ఎక్కువగా ఉంటే డైనోటేఫ్యూరాన్ 80 గ్రాములు ఎకరాకు లేదా పైమెట్రోజైన్ 100గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆంజనేయులు,ఈశ్వరయ్య,నక్క బాలస్వామి,బాలరాజు ఉన్నారు.

## కృష్ణానదిలో వదిలిన 10లక్షల చేప పిల్లలు



సోమశిల కృష్ణానదిలో చేప పిల్లలను వదులుతున్న అధికారులు

కొల్లాపూర్,అక్టోబర్ 19: తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం పూర్తి సబ్సిడీతో 10 లక్షల చేపపిల్లలను మండలంలోని సోమశిల సమీపంలోని కృష్ణానదిలో గురువారం జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమాభివృద్ధి కోసం వివిధ రకాల పనిముట్లు, చేపల నిల్వ చేసుకునేందుకు ఐస్ బాక్సు, ఫోర్‌వీలర్ వాహనం, వలలు సమకూర్చారు.మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఫీల్డ్ మెన్లు శ్రీకాంత్‌పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కొల్లాపూర్, అక్టోబర్ 19 : పట్టణంలోని 4వవార్డులో వారం రోజుల క్రితం ఒకే ఇంటిలో తండ్రి కర్నె కురుమయ్య, తనయుడు శివకుమార్‌లు మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటికృష్ణయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం భాదర్‌పాషా, కౌన్సిలర్ కర్నె అలివేలువాసు,మాజీ వార్డు సభ్యుడు అంబన్న,బీఆర్ఎస్ నాయకులు బరిగెల సత్యనారాయణయాదవ్,గోపాలమల్లయ్య బాధిత కుటుంబానికి మనోధైర్యాన్నిచ్చారు.

# పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

కోడేరు, అక్టోబర్ 19 : మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులను కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర కుమార్ దీపక్ అన్నారు. మండల పరిధిలోని కొండ్రావుపల్లి, బాడుగదిన్నె, ఎత్తం, మైలారం నార్యానాయక్ తండా, తుర్కదిన్నె, నాగులపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపోలింగ్ కేంద్రలో తాగునీటి వసతి, మూత్రశాలలు మరుగుదొడ్లు, పోలింగ్ గదులలో ఫ్యాన్లు, కరెంటుసౌకర్యం, వంటి వసతులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో వసతులు తప్పకుండా ఉండేటట్ల మండల స్థాయి అధికారులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు కూడా కొత్త ఓటర్లనమోదు ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్ సైదులు బీఆఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

**ఓటు హక్కుకు దరఖాస్తులు**

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 19 : మండలంలో 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం ఈనెల చివరినాటికి దరఖాస్తులు చేసుకోవాలని తాసిల్దార్ యూసుఫ్‌అలీ తెలిపారు. గ్రామాల్లో బూత్‌ల అధికారులు ఉంటారని ప్రతిఅర్హత కలిగిన ఓటరు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మార్పులు చేర్పుల్లో కోసం కూడా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన అన్నారు. ఎన్నికల్లో భాగంగా ప్రతిగ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటి వసతులను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**మౌలిక సదుపాయాలు కల్పించాలి**

పాన్‌గల్,అక్టోబర్19 : శాసనసభ ఎన్నికల పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల మౌలిక





ఎత్తం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో రఘురామ్ కోరారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్ తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీవో కురుమయ్య, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మీగా దుర్గాదేవీ....

వీపనగండ్ల, అక్టోబర్19 : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో దుర్గాదేవీ మాతను ధనలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి రూ.14,28,116 దండలుగా ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజేశ్‌గౌడ్, విష్ణు, గోపిపాల్గొన్నారు.

**పెద్దకొత్తపల్లిలో..**

పెద్దకొత్తపల్లి అక్టోబర్ 19: మండల పరిధిలోని ముష్టిపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు మల్లేశ్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ గ్రామ భక్తులు బాలరాజు, తిరుపతి, ఆంజనేయులు, శంకర్ తదితరులు ఉన్నారు.

**పెంట్లవెల్లిలో..**

పెంట్లవెల్లి, అక్టోబర్ 19 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు దుర్గామాతకు భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. కన్యాకా పరమేశ్వరి ఆలయంలో లలితాదేవి రూపంలో దర్శనమిచ్చారు.

**లలితాదేవిగా..**

పాన్‌గల్, అక్టోబర్ 19 : దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం మండలంలోని కేతేపల్లి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం అమ్మవారు లలితా దేవి అలంకరణలో దర్శమిచ్చారు. ఆలయాల్లో భక్తులు పూజాకార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



ముష్టిపల్లిలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కేతేపల్లి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో..



పెంట్లవెల్లిలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళా సభ్యులు



వీపనగండ్లలో ధనలక్ష్మి రూపంలో..

## యువత క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

చిన్నంబావి, అక్టోబర్ 19 : యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు, అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మన్ దారాసింగ్ అన్నారు. గురువారం మండలంలోని బెక్కెంలో విజయదశమిని పురస్కరించుకొని బెక్కెం యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తు స్నేహపూర్వకంగా క్రీడలు ఆడాలని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు మేధోశక్తిని పెంపొందిస్తాయన్నారు. అదేవిధంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి , క్రీడా సామాగ్రిని అందించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.3లక్షలు పట్టివేత

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని పీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో తనిఖీల్లో భాగంగా సోమశిల నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్న కారులో సోమశిల మృదువాణి యజమాని గాజుల రాజేశ్ తన కారులోరూ. 3 లక్షలపై చిలుకు పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈ నగదును జిల్లా ఎన్నికల అధికారి అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా తనిఖీల్లో భాగంగా రూ.1, 90లక్షల ఎన్నికల అధికారికి అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే వారిపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ కానిస్టేబుల్ కల్యాణ్, సంపత్ తదితరులు ఉన్నారు.

## షిరిడీసాయికి పూజలు

పెంట్లవెల్లి, అక్టోబర్ 19 : మండల కేంద్రం సమీపంలో వెలసిన షిర్డీ సాయి ఆలయంలో గురువారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రం నుంచే కాక సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథునికి పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు.

## ప్రభుత్వ దవఖానలో..

పాన్‌గల్, అక్టోబర్19 : ప్రభుత్వ దవఖానలో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని మండల వైద్యాధికారి చిరంజీవి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే కీటకజనిత వ్యాధులు మలేరియా, డెంగీ తదితర విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.